క్లుప్తంగా

పశువ్యాధులపై అప్రమత్తం

గరుగుబిల్లి: పశువ్యాధులపై పాడిరైతులను అప్రమత్తం చేస్తూ పశు సంవర్ధక శాఖ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఎం.శ్రీరాములునాయుడు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతుండడంతో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు వంటి మూగజీవాలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పశువులకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని, పశువులకు 104 నుంచి 106 డిగ్రీల జ్వరం, నోటి నుంచి నురగ కారడం, కళ్లు ఎర్రబడడం, గొంతువాపు, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు కనిపిస్తాయని, ఇవి గమనించిన వెంటనే పశువులను వైద్య కేంద్రాలకు తీసుకువెళ్లి చికిత్స అందించాలన్నారు.

వర్షాల పట్ల ..

భామిని: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తహసీల్దార్ శివన్నారాయణ ఆదేశాల మేరకు వీఆర్‌ఓలు వంశధార నదీ తీర ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి ప్రజలను చైతన్యపరిచారు.

వినాయక చవితి ఉత్సవాల్లో నియమాలు పాటించాలి


ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో పోలీసులు తెలిపిన నియమ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులో మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన గణేశుని నవరాత్రి ఉత్సవాలు మొదలు కానుండడంతో మండపాలు, చలువ పందిళ్లు, విగ్రహాల ఎత్తు విషయంలో పోలీసుల సూచనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. విగ్రహాలు పెట్టే వారంతా పోలీసుల అనుమతి ముందుగా తీసుకోవాలని, మండపాల వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఊరేగింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు


మ్యూజికల్ చైర్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయలో విద్యార్థులకు పలు క్రీడాపోటీలు ఆదివారం నిర్వహించారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయానికి విచ్చేసిన చిన్నారులకు చిత్రలేఖనం, కబడ్డీ, మ్యూజికల్ చైర్ ఆటలు ఆడించారు. అంతకుముందు విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ పుస్తకాలు చదివించి పుస్తక పఠనాన్ని నిర్వాహకుడు ఎన్.మధుసూదనరావు ప్రోత్సహించారు.

వినాయక చవితి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

వీరఘట్టం: ఈ నెల 27న జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆదివారం స్థానిక బార్నాల వీధిలో బాపూజీ యువజన సంఘ సభ్యులు మంటపం నిర్మాణ పనులు ప్రారంభించారు. ముచ్చర్లవీధి, తెలగవీధుల్లో మంటపాలు ఏర్పాటవుతున్నాయి.

కనువిందు చేస్తున్న బ్రహ్మకమలాలు


బ్రహ్మ కమలాలు

సీతంపేట: ఏడాదికోసారి ఈ సీజన్‌లో మాత్రమే పూచే బ్రహ్మ కమలాలు మండల కేంద్రంలోని ఇందుపు ప్రసాదరావు పెరటిలో కనువిందు చేస్తున్నాయి. ఒక మొక్కకే పది పువ్వులు కాయడంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

పాలకొండ రూరల్: స్థానిక ఏలాం కూడలిలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం రాత్రితో ముగిశాయి. యాదవులతో పాటు పట్టణ పరిధిలోని భక్తులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. తొలుత అర్చకులు జన్మాష్టమి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి ఉత్సవంలో అన్ని వర్గాల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, పోలీసులు ఈ వేడుకల్లో సందడి చేశారు.

మహా శ్రేష్ఠం.. మట్టి గణపతి!


విక్రయానికి సిద్ధం చేసిన మట్టి గణపతి విగ్రహాలు


రంగులద్దుకునే దశలో భారీ మట్టి గణపయ్య

- వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు
- జోరందుకున్న విగ్రహాల తయారీ, విక్రయాలు
- పీవోపీ ప్రతిమలతో పొంచి ఉన్న ముప్పు
- మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

గరుగుబిల్లి:

వినాయక చవితి పండగ వచ్చేస్తోంది. ఈ నెల 27 నుంచి గణపతి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో గ్రామాలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా ప్రతి ఇంట్లో, వీధిలో గణనాథులు కొలువుదీర్చి పూజించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఎంతో ఆర్భాటంగా చేసుకునే ఈ వేడుకల్లో మట్టితో చేసిన విగ్రహాలనే వాడాలని పర్యావరణ వేత్తలు, పర్యావరణ పరిరక్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు. మట్టి వినాయకులను పూజించడం అనాదిగా వస్తున్న ఆచారమని, దానిని అలాగే కొనసాగించాలని అదే మంచిదని చెబుతున్నారు.

పర్యావరణ హితమే ప్రధానం..

ఇప్పటి నుంచే గ్రామీణ ప్రాంతాల్లో వినాయక మండపాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మండలంలోని మొత్తం 25 పంచాయతీల్లో దాదాపు 500 వరకు మండపాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఓ అంచనా. ఇవే కాకుండా ప్రతి ఇంట్లో గణపతి ప్రతిమలు పెట్టి పూజలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో హంగులు, ఆర్భాటాలకు పోయి పర్యావరణానికి ముప్పు కలిగించే పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలు వాడవద్దని, అందరికీ మేలు చేసేలా పర్యావరణ హితం కోరుతూ మట్టి గణపతులను పూజిద్దామని పర్యావరణ ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పిలుపునిస్తున్నారు. మట్టి విగ్రహాల వాడకంపై అవగాహన కల్పిస్తూ ప్రతిమల పంపిణీకి కూడా సిద్ధమవుతున్నారు.

సులభంగా నీటిలో కరుగుతుంది..

సహజ సిద్ధంగా పొలాల్లో ఏర్పడిన బంకమట్టితో చేసిన విగ్రహాలు ఏవైనా నీటిలో సులభంగా కరిగిపోతాయి. వీటి వల్ల ఏ జీవరాశికి నష్టముండదు. నీరు కలుషితం కాకుండా ఉండడంతో పాటు అందులోని జీవుల ప్రాణానికి కూడా హాని ఉండదు. అలాగే మట్టి విగ్రహాలకు చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసిన రంగులు వేసుకుని, అందంగా తీర్చిదిద్దుకోవచ్చు. ఈ రంగులు కూడా ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన వనరుల నుంచి వచ్చినందు వల్ల ఎవరికీ ఏ నష్టం ఉండదు.

రసాయనాలతో అనర్థాలెన్నో..

- పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో తయారు చేసిన విగ్రహాలను కాలువలు, చెరువులు, నదులలో నిమజ్జనం చేస్తే కరగవు. వీటిలో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్, కార్బన్ రసాయనాలు ఉండడంతో అది కరగడం అంత సులభం కాదు. పైగా నీటిని ఆవాసంగా చేసుకుని జీవించే వాటి మనుగడ ప్రమాదంలో పడిపోతుంది.
- పీవోపీ ప్రతిమలు నిమజ్జనం చేసిన చెరువు నీటిని గానీ, కాలువ నీటిని గానీ పశువులు తాగితే అవి జీర్ణకోశ వ్యాధుల బారినపడతాయి.
- పీవోపీ విగ్రహాల్లో వాడే రసాయనాలు నరాలపై కూడా ప్రభావం చూపి కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయి, అలాగే చర్మవ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయి
- రసాయన రంగులు కలిసిన నీరు పంట పొలాల్లో చేరితే పంట దిగుబడులు తగ్గించడమే కాకుండా అవి ఆహారోత్పత్తులను సైతం కలుషితం చేస్తాయి
- పీవోపీ విగ్రహాలు నీటిలో కరగడానికి కొన్ని సంవత్సరాల సమయం పడుతుంది. ఈలోగా అది నీరు, నేల, గాలి ఇలా అన్నింటినీ కాలుష్యం చేస్తాయి.

మట్టి విగ్రహాలు మంచివి..



పూర్వం నుంచి మన పూర్వీకులు మట్టితో చేసిన గణేశుని విగ్రహాలనే పూజకు వినియోగిస్తున్నారు. ఇది మట్టి మనిషి సహజత్వానికి నేలతో ఉండే అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. మట్టి ప్రతిమలు పర్యావరణాన్ని కాపాడడమే కాకుండా మన ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
–డి.పారినాయుడు, జట్టు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, తోటపల్లి

హైకోర్టు జడ్జికి సన్మానం


తుహీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

పాలకొండ: హైకోర్టు జడ్జిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తుహిన్‌కుమార్‌ను స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. వీరఘట్టం మండలం కత్తులకవిటి గ్రామానికి చెందిన తుహిన్‌కుమార్ హైకోర్టు జడ్జిగా నియమితులు కావడం ఈ ప్రాంతానికి చెందిన గర్వకారణమని న్యాయవాదులు కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి చందక హరిప్రియ, సీనియర్ న్యాయవాదులు ఉత్తరావల్లి మురళీమోహన్, చందక జగదీష్‌కుమార్, కనపాక సూర్యప్రకాశరావు, తిర్లంగి ఉపేంద్రకుమార్, కర్రా రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 51 మంది ఎంపిక


శిబిరానికి వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న వైద్యుడు వివేక్ వర్మ

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, విశాఖపట్నం సహకారంతో జరిగిన ఈ శిబిరానికి మొత్తం 107 మంది కంటి రోగులు హాజరుకాగా వారి కళ్లను వైద్యులు తనిఖీలు చేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 51 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరికి శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు వివేక్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండను జిల్లాగా ప్రకటించాలి

- జిల్లా సాధన సమితి


పాలకొండ జిల్లా సాధన సమితి సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

పాలకొండ రూరల్: భౌగోళికంగా అన్ని వనరులు కలిగి ఉన్న డివిజన్ కేంద్రం పాలకొండను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని అయ్యప్ప శంకర్ కల్యాణ మంటపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి గౌరవ అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను సర్కారు దృష్టికి తీసుకువెళ్లే క్రమంలో ఈ నెల 21న కోటదుర్గమ్మ దేవస్థానం నుంచి భారీ ర్యాలీ చేపట్టనున్నమన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని చెప్పారు. అలాగే పోస్టు కార్డులు, సామాజిక మాధ్యమాల ద్వారా చేపట్టనున్న కార్యాచరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పరిధిలోని యువత, మేధావులు, విద్యావేత్తలు, వివిధ ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కార్యక్రమంలో సాధనమితి సభ్యులు సబ్బా నానాజీరావు, వండాన కూర్మారావు, ఆర్.బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

నాగావళిలో పెరిగిన నీటి ఉధృతి



పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గడిచిన రెండు రోజులుగా వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వరుణుడు తన ప్రతాపం చూపాడు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు స్థానిక వర్ష ప్రభావంతో నాగావళి నదీ తీరంలో వరద ఉధృతి ఊపందుకుంది. దీంతో తీర ప్రాంత గ్రామాలైన అన్నవరం, అంపిలి, గోపాలపురంతో పాటు చిన్న, గొట్ట మంగళాపురాలు, ఎరకారాయపురం, తదితర ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 400 ఎకరాల్లో వరి, చెరకు మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వర్ష ప్రభావంతో తహసీల్దార్ రాధాకృష్ణ నేతృత్వంలో ఎస్సై ప్రయోగమూర్తితో కూడిన బృందం తీర ప్రాంతాలలో పర్యటించింది. స్నానాలకు, ఇతర అవసరాలకు నదిలో దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తీరప్రాంత గ్రామాల్లో దండోరా వేయించారు.

విస్తారంగా కురుస్తున్న వర్షాలు


కె.శివడ ప్రాంతంలో కురుస్తున్న వర్షం


భామిని: పసుకుడి వద్ద పడుతున్న వాన

గుమ్మలక్ష్మీపురం: తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు, వీధులు, కాలువల్లో వర్షపునీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

భామినిలో..

భామిని: మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు లోతట్టు పొలాలు ముంపునకు గురయ్యాయి. భామిని, లివిరి, దిమ్మిడిజోల తంపర భూముల్లో నీరు బాగా చేరడంతో చెరువుల్లా దర్శనమిస్తున్నాయి.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


కొమరాడ: ద్విచక్ర వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ నీలకంఠం


జియ్యమ్మవలస రూరల్: ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్

కొమరాడ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.నీలకంఠం హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు ఆదివారం అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్లే చాలా ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్ఘటన జరిగిన తర్వాత హెల్మెట్ ఉంటే బతికేవారని అనుకోవడం కన్నా వాహనంపై బయలుదేరినప్పుడే హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణహాని ఉండదన్నారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.1000 అపరాధ రుసుం విధించి, వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఇతర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు.

జియ్యమ్మవలస రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ నెల 18వ తేదీ నుంచి హెల్మెట్ లేకుండా ప్రయాణించిన ద్విచక్ర వాహనదారుడికి అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు. ప్రతి వాహనదారుడూ నిబంధనలు పాటించాలని కోరారు.

వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్లే రహదారిలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి వారి వాహనాల ధ్రువపత్రాలు, వాహనదారుల లైసెన్స్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని కోరారు.

అతివేగం వద్దు

సీతంపేట: ఘాట్‌రోడ్‌లలో అతివేగంగా వాహనాలు నడపవద్దని దోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ అన్నారు. మండలంలోని కిల్లాడలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం (కురుపాం): వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు


సీతంపేట: కిల్లాడలో అవగాహన కల్పిస్తున్న దోనుబాయి పోలీసులు

వణుకుతున్న వంతెనలు..

- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పాలకొండ రూరల్:

డివిజన్ కేంద్రం పాలకొండ మీదుగా అంతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రధాన మార్గాల్లో ఉన్న వంతెనలు ప్రమాదకరంగా మారాయి. నిర్వహణ కొరవడడంతో భారీ వంతెనలు మొదలు చిన్నపాటి ఖనాలు కూడా వణుకుతున్నాయి. ముఖ్యంగా పాలకొండ మీదుగా వీరఘట్టం వయా పార్వతీపురం నుంచి ఒడిశా రాయగడకు వెళ్లే మార్గంలో స్థానిక గజాలఖానా వంతెనపై ఇరువైపులా గడ్డి, పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. దీని కారణంగా వర్షపునీరు వంతెన దిగువకు చేరకుండగా పైభాగంలో నిలిచిపోవడంతో రంధ్రాలు ఏర్పడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. పదేళ్ల కిందట టీడీపీ హయాంలో ప్రారంభమైన ఈ వంతెనలో నాణ్యతా లోపాలు దర్శనమిస్తున్నాయి. అలాగే పట్టణం నుంచి విజయనగరం, విశాఖ వెళ్లే రహదారిలో గోపాలపురం వద్ద మినీ వంతెన నిర్వహణకు నోచుకోక అవశాన దశకు చేరుకుంది. స్థానిక కోటదుర్గమ్మ కూడలి మీదుగా రాజాం, వీరఘట్టం వైపు వెళ్లే మార్గంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వంతెన రెయిలింగ్ పూర్తిగా రూపు కోల్పోయింది. ఈ మినీ వంతెన దిగువభాగం డంపింగ్ యార్డ్‌గా మారింది.


గజాలఖానాపై పేరుకుపోయిన గడ్డి

ఇదే కోవలోకి వస్తుంది పాలకొండ – వీరఘట్టం ప్రధాన రహదారిలతో గల రాజుపేటఖానా. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ ఖానాకు ఇరువైపులా పిచ్చి మొక్కలు అధికమై బలహీన పడింది. వంతెన బీటలు దేరడంతో పాటు ఖానాకు ఇరువైపులా ఉన్న సిమెంట్ రెయిలింగ్ కూలిపోయింది. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్న గెడ్డలోకి పడిపోక తప్పదని పలువురు వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సాక్షిలో పలు కథనాలు ప్రచురితమైనా అధికారుల్లో చలనం లేదు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ప్రమాదకర స్థితికి చేరుకున్న గోపాలపురం వంతెన


స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద విశాఖ రోడ్డులో రూపు కోయిన మినీ వంతెన


పాలకొండ- వీరఘట్టం రహదారిలో రాజుపేట వద్ద రెయిలింగ్ కోల్పోయిన పాత ఖానా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పాలకొండ రూరల్: నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి, తదితర వాటిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల సూచనల మేరకు పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ప్రత్యేక చెక్‌పోస్టును ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత మత్తు పదార్థాల రవాణాను అరికట్టడానికి చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే పట్టణంలోకి ప్రవేశించే అన్ని ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ఈ చెక్‌పోస్టు వద్ద ఎస్సై ప్రయోగమూర్తితో పాటు ఏఎస్సైలు ధర్మారావు, నారాయణరావు, తదితరుల పర్యవేక్షణలో తనిఖీలు జరుగుతాయన్నారు.

నేడు కలెక్టర్ వద్దకు రైతులు

గరుగుబిల్లి: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నీటమునిగిన వరినాట్లు పరిస్థితిని వివరించేందుకు రైతులు కలెక్టరు వద్దకు సోమవారం వెళ్లనున్నారు. ఈ విషయాన్ని రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వానలకు గ్రామంలోని దేసూరి గెడ్డ పొంగి వరినాట్లు పొలాలను ముంచెత్తిందని, అయినా పరిశీలనకు వ్యవసాయ శాఖ అధికారులు ఎవరూ రావడం లేదని, ఈ విషయం తెలిసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇదే అంశంపై పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి వెళ్లి, కలెక్టర్‌ను కలవనున్నామన్నారు.